అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో జ్ఞానమాల


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కీసర: అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో కీసరలో జ్ఞానమాల కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర జ్ఞాన ప్రచార వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లబాబు హాజరై అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొమ్ము సుదర్శన్, తుడుం శ్రీనివాస్, అంబేడ్కర్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన 'సీఆర్ఈ' శిక్షణ తరగతులు

మేడ్చల్: పట్టణంలోని ఉమానగర్ సేయింట్ ఆన్స్ మనోవికాస కేంద్రంలో గత మూడ్రోజులుగా నిర్వహిస్తున్న సీఆర్ఈ శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. మనోవికాస కేంద్రంలో చైల్డ్ ప్రొటెక్షన్ పాలసీ యాక్ట్ అంశంపై మూడ్రోజుల పాటు శిక్షణ తరగుతులు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల వద్దకు వెళ్లి వివరించారు. స్కూల్ హెడ్ మాస్టర్ సామయ్య, ఇన్‌చార్జ్ కీర్తి, డేవిడ్ రాజు, కళ్యాణి, లీలా ప్రకాష్, లలితాబాయి, అహ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

శామీర్‌పేట్: టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్ పుట్టినరోజు సందర్భంగా జిల్లా ఆర్టీఏ మెంబర్ జైపాల్‌రెడ్డి, జిల్లా యువజన కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి వజ్జల శశాంత్‌లు 150 పారిశుద్ధ్య కార్మికులకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. సీతారామచంద్రస్వామి ఆలయ చైర్మన్ లక్ష్మీనారాయణ, వైద్యులు నరేష్, ధీరజ్, తేజస్విని, అవినాష్, ధర్మకర్త హరికృష్ణ, యువజన కాంగ్రెస్ కార్యదర్శి రమేష్, మున్సిపల్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



ఘట్‌కేసర్: అంబేడ్కర్ ఆలోచనల సాధనకు పోరాటం ఆపేది లేదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యుగేందర్‌గౌడ్ అన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చేంత వరకు పోరాటం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రబుద్ధ భారత్ బాధ్యుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టికల్ 340 ప్రకారం వెనకబడిన వర్గాల సామాజిక, విద్య, ఆర్థిక పరిస్థితులను పరిశీలించేందుకు కమిషన్ ఏర్పాటు చేసి, వారికి సమాన అవకాశాలు కల్పించేందుకు అవసరమైన చర్యలను సిఫార్సు చేయాలని కోరారు. దాసు, బాల్‌రాజ్, యూసుఫ్, బాలయ్య, సత్యం, రవి, అంజయ్య, సురేష్‌గౌడ్, జగదీశ్, కృష్ణంరాజు, శ్రీరామ్, నిఖిల్, విష్ణువు, లలిత పాల్గొన్నారు.

మహనీయుల ఆశయసాధనకు కృషి చేయాలి

మల్లాపూర్: నాచారం ఎర్రకుంటలో మహనీయులు డాక్టర్ బీఆర్. అంబేడ్కర్, బాబు జగ్జీవన్‌రామ్ చిత్రపటాలకు పూలదండ కార్యక్రమం ఆదివారంతో 254 వారానికి చేరింది. మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి వారి ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. లోయాకస్వామి, చిలుక శంకర్, జంగం అశోక్, గద్ద క్రాంతి కిషోర్, ఐలేని మహేష్, వెంకటేష్ తదితరులున్నారు.

పండుగ పూట జాగ్రత్త !

● ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలి ● బాణాసంచా కాల్చేటప్పుడు అప్రమత్తత అవసరం

ఘట్‌కేసర్: అంధకారాన్ని పారదోలి జ్ఞానజ్యోతిని నింపేది దీపాల పండుగ దీపావళి. పల్లె, పట్టణం, చిన్న పెద్ద తేడా లేకుండా బాణాసంచా కాలుస్తూ.. సంతోషంగా జరుపుతారు. ప్రమాదం జరగక ముందే జాగ్రత్తలు పాటిస్తే పండుగ సంతోషంగా నిర్వహించుకోవచ్చు.

మితిమీరిన శబ్దం వద్దు..

మితిమీరిన శబ్దాన్నిచ్చే బాణాసంచా కాల్చడంతో మనుషులు, జంతువులు, పక్షుల్లో వినికిడి సమస్య తలెత్తుతుంది. 125 డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్దం చేసే పటాకుల వల్ల మనిషిలో మానసిక సమస్యలు వస్తాయి. 50 డెసిబుల్స్ శబ్దం మించితే జంతువుల్లో అలజడి మొదలై రోడ్లపై ఇష్టానుసారంగా పరుగెత్తి ప్రమాదాల భారినపడి మృతి చెందుతాయి.

బాణాసంచా కాల్చే సమయంలో..

బాంబులు, చిచ్చుబుడ్లను చేతిలో ఉంచి కాల్చకూడదు. రాకెట్ లాంటి టపాసులు గుడెసెలు, గడ్డివాములకు దూరంగా పేల్చాలి. పేలని పటాకులను



తిరిగి నిప్పుతో వెలిగించకూడదు. కాల్చే సమయంలో పిల్లల దగ్గర కుటుంబసభ్యులు ఉండాలి.

- నైలాన్, సిల్క్ దుస్తులు, కాళ్లకు చెప్పులు ధరించాలి. పేలుడు పటాకులు బహిరంగ ప్రదేశాల్లోనే కాల్చాలి.
- దుస్తులకు మంటలు అంటుకుంటే నేలమీద పడుకుని దొర్లి ఆర్పే ప్రయత్నం చేయాలి. మంటలు అంటుకుంటే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వాలి.
- టపాకాయలు కాల్చిన వెంటనే కాళ్లు, చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. పండుగ పూట పరధ్యానంగా ఉండి ప్రమాదాలు కొని తెచ్చుకుని ఇబ్బంది పడొద్దని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వ్యాపారులు పాటించాల్సిన నిబంధనలు..

- దుకాణాల ఏర్పాటుకు మొదటగా ఫైర్, విద్యుత్‌శాఖ అధికారుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- బాణాసంచా గోదాములు, దుకాణాలు ఇళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాలు, పెట్రోల్ బంకులకు దూరంగా ఏర్పాటు చేసుకోవాలి.
- 18 ఏళ్ల లోపు పిల్లలను దుకాణంలో పని చేయించడం నేరం.
- దుకాణాల మధ్య 3 మీటర్ల దూరం పాటించాలి. నీటితో నింపిన డ్రమ్ములు, ఇసుకతో నింపిన బకెట్లు, అగ్ని నిరోధక పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలి.

మార్కెట్‌లో దీపావళి సందడి


ఘట్‌కేసర్‌లో ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు


బాణాసంచా దుకాణంలో కొనుగోళ్లు

కిటకిటలాడిన దుకాణాలు

ఘట్‌కేసర్: మార్కెట్‌లో దీపావళి సందడి మొదలైంది. దీపావళి పర్వదినం పూజలకు పెట్టింది పేరు. మున్సిపాలిటీ ప్రజలే కాకుండా సరిహద్దు గ్రామాల ప్రజలు పట్టణానికి చేరుకోవడంతో దుకాణాల్లో సందడి నెలకొంది. పూలు, మిఠాయి దుకాణాలు బాణాసంచా, ప్రమిదల దుకాణాలు కిటకిటలాడాయి.

- అంబేడ్కర్ చౌరస్తా, బస్ టెర్మినల్ ఎదురుగా మెయిన్ రోడ్డు, ఎదులాబాద్ రోడ్డులో పెద్దఎత్తున బాణాసంచా, పూలు, ప్రమిదలు, గుమ్మడికాయల దుకాణాలు ఏర్పాటు చేశారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ కృషి

కీసర: కార్మికుల హక్కుల పరిరక్షణకు సీఐటీయూ కృషి చేస్తుందని రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాసులు అన్నారు. కీసర మండలం సీఐటీయూ తొలి మహాసభలు దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ప్రజాయ్ సాయిగార్డెన్ కమ్యూనిటీహాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం హామీ ఇచ్చిన వేతన సవరణలు, పీఎఫ్, ఈఎస్ఐ అమలులో విఫలమైందన్నారు. సీఐటీయూ కార్మికుల పక్షాన నిలిచి హక్కుల సాధనకు నిరంతరం పోరాడుతుందన్నారు. ఎస్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్, ఐద్వా మేడ్చల్ జిల్లా నాయకులు వినోద, సీఐటీయూ నాయకులు, బంగారు నర్సింగ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏకగ్రీవం..

సీఐటీయూ కీసర మండలం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా బంగారు నర్సింగ్‌రావు, సభ్యులుగా చింతకింది అశోక్, వెంకటేష్, కృష్ణ, అశ్విని, రాములమ్మ, జంగయ్య, స్వామి, జాన్‌మోషా, లలిత, మోహన్, రోశప్ప, వెంకట్, వెంకటేష్, రాణి, నీరజ, జయమ్మ, లావణ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు

గురుకుల్ పరిరక్షణ సమితి ఏర్పాటు



ఘట్‌కేసర్: స్థానిక గురుకుల్ పాఠశాల, జూనియర్ కళాశాలను కాపాడాలని పూర్వ విద్యార్థులు సురేష్‌యాదవ్, మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురుకుల్ విద్యాసంస్థ పరిరక్షణ సమితిని ఎన్నుకున్నారు. గురుకుల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా చూడాలని, పాఠశాల, జూనియర్ కళాశాల యథావిధిగా నడిపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గురుకుల్ విద్యాసంస్థలు దేవాదాయధర్మాదాయశాఖ నుంచి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని తీర్మానించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు

కీసర: కీసర అహ్మద్‌గూడలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్‌లో తెలంగాణ రాష్ట్రస్థాయి డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల డైరెక్టర్ సుశీల్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీలత హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 16 విద్యాసంస్థల నుంచి విద్యార్థులు హాజరై వారి ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు. శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



గంజాయి విక్రేత రిమాండ్


నిందితుడు రాజు

మల్లాపూర్: గంజాయి విక్రేతను నాచారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాచారం కార్తికేయనగర్ శ్మశానవాటికలో గంజాయి విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు నాచారం పోలీసులు ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. నాచారం ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌గా పనిచేస్తున్న బిలోలు రాజు అలియాస్ భానుచందర్(35)ను విచారించగా.. చత్తీస్‌గఢ్, రాయపూర్ ప్రాంతానికి చెందిన ధనుష్ అనే వ్యక్తి నుంచి 5 కిలోల గంజాయిని రాజు, సాయికిరణ్, దయాకర్‌లు కలిసి కొనుగోలు చేశారు. 4 కిలోల గంజాయిని వాడుకుని మిగిలిన 1 కేజీని శనివారం రాత్రి విక్రయించేందుకు యత్నించగా.. పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద ఉన్న 1188 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

హెచ్చరిక బేఖాతరు !

రోడ్డు పక్కనే ఇష్టానుసారంగా వ్యర్థాల పారబోత

మేడ్చల్: చెత్తవేయడానికి ప్రజలకు ఏ ప్రాంతం అనర్హం కానట్టుగా మేడ్చల్ మున్సిపాలిటీ తయారైంది. కాలనీలలో ఇళ్ల మధ్య వివిధ ప్రాంతాలకు వెళ్లే రహదారి పక్కన వ్యర్థాలను ఇష్టానుసారంగా పారవేస్తున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా మరింత చెత్త వీధుల్లో కనిపిస్తుంది.

ఎక్కడపడితే అక్కడ చెత్త..

ఒకప్పుడు మేడ్చల్ మున్సిపాలిటీ స్వచ్ఛతలో అగ్రస్థానంలో ఉండేది. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దక్షిణ భారతదేశంలో చిన్నపట్టణాల జాబితాలో మేడ్చల్ మున్సిపాలిటీ అగ్రస్థానంలో నిలిచి, దేశస్థాయిలో అవార్డు పొందింది.

- నేడు మేడ్చల్ మాత్రం అవార్డు అందుకున్న నాటి పరిస్థితులకు భిన్నంగా మారింది. పట్టణంలో ఏ వార్డు చూసినా.. చెత్తమయంగా కనబడుతోంది. పట్టణంలోని 23 వార్డుల్లో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. విలీన గ్రామాలు అత్వెల్లి, కిష్టాపూర్, రాయిలాపూర్, పూడూర్‌లలో చెత్త సమస్యను పట్టించుకునే వారె లేకుండా పోయారు.


మేడ్చల్-శామీర్‌పేట్ రహదారి పక్కనే చెత్తకుప్పలు

జరిమానాలు విధిస్తున్నా..

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసిన వారికి మున్సిపాలిటీ అధికారులు జరిమనాలు విధిస్తూ.. బహిరంగ ప్రదేశాలను గుర్తించి అక్కడ చెత్త వేయకూడదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా పరిస్థితిలో మార్పు రావడం లేదు. బోర్డులు ఉన్న పక్కనే చెత్త వేస్తున్నారు.

పటిష్ఠం చేయాలి..

పారిశుద్ధ్యం, పరిశుభ్రత చూసే మున్సిపల్ శానిటరీ విభాగం మరింత పటిష్ఠం చేయాల్సిన అవసరం ఉంది. కార్మికులు ఎప్పటికప్పుడు చెత్తను తరలించే పద్ధతులలో మార్పు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రస్తుతం వార్డులలో వార్డు ఆఫీసర్లు, జవాన్లు పరిశుభ్రత కోసం పనిచేస్తున్నా.. మరింతగా పనిచేయాల్సిన అవసరం ఉంది. ఇళ్ల నుంచి చెత్త సేకరణకు పేయిడ్ పద్ధతి ఉండటంతో పరిస్థితి బాగానే ఉన్నా రోడ్లపై చెత్తను ఊడ్చి పక్కనే నిల్వ ఉంచి 2–3 రోజులకోకసారి తొలగిస్తుండటంతో రోడ్డు పక్కన పరిసరాలు కంపుకోడుతున్నాయి.


చెక్‌పోస్టు వద్ద వ్యర్థాలు ఇలా..